





RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 315 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 03-03 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## ఇరాన్‌లో 550 మందికి పైగా మృతి

# అగ్నిగుండంగా పశ్చిమాసియా




**130కి పైగా నగరాలపై, నటంజ్ అణుస్థావరంపై ఇజ్రాయిల్, అమెరికా దాడులు**

- గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతీకార దాడులు &కువైట్‌లో అమెరికా ఎంబసీపై దాడి
- నెతన్యాహు కార్యాలయంపై దాడిచేశాం : ఇరాన్ ప్రకటన
- పొరపాటున అగ్రరాజ్య యుద్ధ విమానాలు కూల్చివేసిన కువైట్

టెహరాన్, టెల్ అవీవ్, వాషింగ్టన్

పశ్చిమాసియా దాడులు, ప్రతిదాడులతో అగ్నిగుండంగా మారింది. ఇజ్రాయిల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులు తీవ్రతరం చేశాయి. వరుసగా మూడో రోజు కూడా భీకర పోరు సాగుతోంది. 130కి పైగా నగరాలపై, నటంజ్ అణుస్థావరంపై ఇజ్రాయిల్, అమెరికా దాడులు చేయగా, గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైనా, కువైట్‌లోని అమెరికా ఎంబసీపైనా ఇరాన్ ప్రతీకార దాడులు చేసింది. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు కార్యాలయం పైన కూడా దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఇరాన్‌పై చేస్తున్న దాడులను తక్షణమే ఆపాలని చైనా విజ్ఞప్తి చేయగా, మరో నాలుగైదు వారాలు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇరాన్‌లోని 130కి పైగా నగరాలను, పట్టణాలను లక్ష్యంగా చేసుకుని సోమవారం నాడు అమెరికా, ఇజ్రాయిల్ దాడులు చేశాయి. ఆ దాడుల్లో 555 మందికి పైగా మరణించినట్లు ఇరాన్ రెడ్ క్రీసెంట్ సొసైటీ తెలిపింది. నటంజ్ వద్ద గల అణుస్థావరంపై సోమవారం దాడి జరిగిందని ఐఎఇఎలో ఇరాన్ రాయబారి రెజా నజాఫి మీడియాకు తెలిపారు.

-మిగతా 2 లో



## నేడు సంపూర్ణ చంద్రగ్రహణం

- ఆకాశంలో కనిపించనున్న బ్లడ్‌మూన్
- ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు
- మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం
- దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలు
- తెలుగు రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది

హైదరాబాద్,

మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. సంపూర్ణ చంద్రగ్రహణంతో ఈ అవకాశం దక్కనుంది. ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగళవారం మధ్యాహ్నం 3.20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానుంది. అయితే, దీని ప్రభావం మాత్రం 4.34 గంటల నుంచి మొదలవ్వనుంది. ఇండియాలోని చాలా రాష్ట్రాల్లో బ్లడ్‌మూన్‌ను చూడాలంటే సూర్యాస్తమయం

-మిగతా 2 లో

## బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి

**కాంగ్రెస్ పీఏసీ సమావేశంలో అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపు**

- డీసీసీ అధ్యక్షులే మన సైన్యం
- పని చేయండి.. పదవులు అవే వస్తాయి
- పార్టీ నిర్మాణంపై దృష్టి సారించండి
- వచ్చే రోజులన్నీ మనవేనంటూ దిశా నిర్దేశం
- వికారాబాద్‌లో ముగిసిన శిక్షణ కార్యక్రమాలు

-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి, హైదరాబాద్

ఇండో అమెరికా ట్రేడ్ డీల్ మనకు అత్యంత ప్రమాదకరమని పార్లమెంటులో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ చర్యలతో మనదేశంలో సైతం యుద్ధ వాతావరణం నెలకొందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు ఆయన పూర్తిగా దాసోహమయ్యారని ఎద్దేవా చేశారు. అందుకే మోడీ.. అమెరికాకు వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ఇరాన్‌లో తలెత్తిన పరిస్థితులు ఇండియాలో రాకుండా చూసుకోవాలని ఆయన దేశ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై

-మిగతా 2 లో






## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

- అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం
- డిసిసి అధ్యక్షులు శిక్షణ శివిరం ముగింపులో సిఎం రేవంత్

వికారాబాద్,

లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు.

-మిగతా 2 లో



## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి
- మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం
- యుద్ధం ముగిసేలోపు మరింత మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంది
- అయినా ముందుకే వెళ్తాం.

వాషింగ్టన్,

ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగు, ఐదు వారాలు జరగొచ్చని, ఆ యుద్ధం ముగిసేలోపు మరింత మంది ఎక్కువ అమెరికా సైనికులు మృతి చెందే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' మరికొద్ది రోజుల పాటు పూర్తి స్థాయిలో కొనసాగుతుందన్నారు. అలాగే అమెరికా సైనికుల గురించి కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఈ ఆపరేషన్‌లో ఇప్పటివరకు ముగ్గురు అమెరికా సైనికులు మృతి చెందారు. మా సైనికుల మృతికి కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం.

-మిగతా 2 లో

## తెలంగాణ యువతను దగా చేసిన రాహుల్

- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణ

హైదరాబాద్,

రాష్ట్ర యువతను కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పచ్చిగా మోసగించారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అధికారంలోకి వస్తే ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అడిగితే పోలీసులతో అణచివేస్తారా? అని సోమవారం ఓ ప్రకటనలో మండి పడ్డారు. 'యువత ఆకాంక్షలు చిదిమేశారు. యూత్ డిక్లరేషన్‌ను బోగస్ చేశారు. జాబ్ క్యాలండర్ పత్తా లేదు. కాంగ్రెస్ అంటేనే మోసం.. వంచన అని మరోసారి నిరూపించుకున్నారు' అని తెలిపారు. రాహుల్‌ను అడ్డుకుంటారన్న నెపంతో ముందస్తుగా నిరుద్యోగులను అరెస్టు చేయడం దుర్మార్గమన్న కవిత.. వెంటనే 2 లక్షల ఉద్యోగాలివ్వక పోతే కాంగ్రెస్ పార్టీకి నిరుద్యోగులు కర్రు కాల్చి వాత పెడతారని హెచ్చరించారు.



## అమెరికాతో చర్చలు జరపం

- రెండుసార్లూ దాడులు చేశారు: ఇరాన్
- మాట్లాడుకుందాం : అమెరికా

టెహ్రాన్

అమెరికాతో చర్చలు జరిపే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. చర్చలకు తాము సుముఖంగా ఉన్నామంటూ అమెరికా చేస్తున్న వాదనను తోసిపుచ్చింది. 'వాషింగ్టన్‌తో చర్చలు పున: ప్రారంభించేందుకు మధ్యవర్తుల ద్వారా ఇరాన్ జాతీయ భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజానీ ప్రతిపాదన పంపారు' అంటూ వాల్ స్ట్రీట్ జర్నల్‌లో వార్త వచ్చింది. అమెరికాతో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలు ఇప్పటికీ ఉన్నాయా అని ఏబీసీ రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ

-మిగతా 2 లో



## హిందువులంతా ఐక్యంగా పోరాడాలి

**బాన్సువాడ ఘటన దురదృష్టకరం**

- హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
- ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
- కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు

కామారెడ్డి

హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు.

-మిగతా 2 లో



## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

- ప్రభుత్వ సేవల్లో లోపం రాకుండా చూడాలి
- బాణాసంచా ప్రమాదంపై శివకాశికి వెళ్లి స్టడీ
- అధికారులకు సిఎం చంద్రబాబు సూచన

అమరావతి,

ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని, అధికారులు ఆ మేరకు కృషి చేయాలని సిఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్సెప్షన్ ఉండాలని స్పష్టం చేశారు. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

-మిగతా 2 లో




## రాహుల్‌ను ప్రధాని చేయడమే
# మన కర్తవ్యం

మొదటి తరువాయి

గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్థాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

## నేడు సంపూర్ణ
# చంద్రగ్రహణం

మొదటి తరువాయి



వరకు వేచి చూడాల్సిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లో కూడా సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ ఉంటుంది. గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని వీక్షించే అవకాశం కూడా తెలుగు రాష్ట్రాలకు ఉండనుంది. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చందగ్రహణం ఏర్పడుతుంది. భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి, కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుంది. దీని వల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు. చంద్రుడు ఎరుపు రంగులో కనిపిస్తాడు కాబట్టి.. దాన్ని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుంది. అయితే, ఇండియాలోని ప్రజలు బ్లడ్‌మూన్‌ను కొంత సమయం పాటు మాత్రమే చూసే అవకాశం ఉంటుంది. దేశంలోని చాలా నగరాల్లో 7 నుంచి 25 నిమిషాల పాటు బ్లడ్‌మూన్‌ను వీక్షించే అవకాశం ఉంటుంది. దేశ రాజధాని ఢిల్లీ ప్రజలకు దాదాపు 20 నిమిషాలకుపైగా సమయం వరకు గ్రహణాన్ని వీక్షించనున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి భారతదేశంలోని తూర్పు, ఈశాన్య ప్రాంతాలు అత్యంత అనుకూలమైనవి. ఈ ప్రాంతాల్లో త్వరగా చంద్రోదయం అవుతుంది కాబట్టి గ్రహణం ఎక్కువ సేపు ఉంటుంది. ఇటానగర్,గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో గ్రహణం అత్యంత స్పష్టంగా, ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వెల్లడించారు.

## ఈ యుద్ధం మరో నాలుగైదు వారాలు జరగొచ్చు

మొదటి తరువాయి

యుద్ధం ముగిసేలోపు మరింత మంది అమెరికా సైనికులు ప్రాణాలు కోల్పోయే అవకాశముంది. అయినా ముందుకే వెళ్తాం. ఈ దాడుల వల్ల ఇరాన్‌లో 200 మంది మరణించినట్టు తెలిసింది. ఇరాన్ ఐఆర్‌జీసీ, మిలిటరీ దళాలు ఆయుధాలు వీడితే వారికి రక్షణ కల్పించేందుకు సిద్ధం. లేదంటే వారికి చావు తప్పదు. అలాగే చర్చల కోసం మా దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయి' అని ట్రంప్ పేర్కొన్నారు . అలాగే తనపై జరిగిన హత్యాయత్నాల గురించి కూడా ట్రంప్ స్పందించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై ఇప్పటికి రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయితే, నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథను ముగించా. నన్ను పట్టుకోకముందే, నేను అతడిని పట్టుకున్నా. ఇరాన్‌పై విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నాం. ఆ ఆపరేషన్ 4-5 వారాలు కొనసాగొచ్చు. యుద్ధ తీవ్రతను ఇదే విధంగా కొనసాగించడం అమెరికా, ఇజ్రాయెల్‌కు పెద్ద కష్టం కాదు' అని ట్రంప్ పేర్కొన్నారు.

## ప్రజాభిప్రాయం మేరకు నడుచుకోవాలి

మొదటి తరువాయి

తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన పాలనలో 'పబ్లిక్ పర్సెప్షన్' కు అధిక ప్రాధాన్యతని స్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్‌పై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని అన్నారు.

# అగ్ని గుండంగా పశ్చిమాసియా

మొదటి తరువాయి



దీనిపై స్పందించిన అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) చీఫ్ గ్రాసి ఇరాన్ అణు స్థావరాలు సురక్షితంగానే వున్నాయని వాటిపై దాడి జరిగినట్లు ఎలాంటి సంకేతాలు కనిపించడం లేదనిప్రకటించారు. సోమవారం అత్యవపసరంగా నిర్వహించిన 35మంది సభ్యుల గవర్నర్ల బోర్డులో ఆయన ఈ విషయం తెలిపారు.

గాంధీ ఆసుపత్రిపై దాడి

టెహరాన్‌లోని గాంధీ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ సోమవారం ఉదయం దాడి చేసింది. ఆస్పత్రికి సమీపంలోని మూడు మెడికల్ సెంటర్లపై కూడా దాడి జరిగినట్లు డబ్ల్యుహెచ్‌ఓ తెలిపింది. దీంతో ఆ ప్రాంతంలో భయానక పరిస్థితి నెలకొంది. దాడులతో గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న రోగులను అక్కడి నుండి తరలించారు. ఇరాన్‌కు మద్దతుగా హిజ్బుల్లా రంగంలోకి దిగడంతో ఆ సంస్థ చీఫ్ నయీమ్ ఖిసింకు అయతుల్లా ఖమేనికి పట్టిన గతే పట్టిస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ప్రకటించారు.

ఇరాన్ ప్రతీకార దాడులు

తమ సుప్రీం నేత ఖమేనీ హత్యకు ప్రతీకారంగా ఇరాన్ కూడా దాడులు ముమ్మరం చేసింది. ప్రధాని నెతన్యాహు కార్యాలయంతో సహా పలు ఇజ్రాయిల్ లక్ష్యాలపై వరుసగా క్షిపణులతో దాడులు జరిపినట్లు రివల్యూషనరీ గార్డ్స్ తెలిపారు. టెల్ అవీవ్, హైఫా, తూర్పు జెరూసలేం తదితర చోట్ల దాడులకు దిగామని, ఇది పదవ దాడి అని ప్రకటించారు. కువైట్ నగరంలోని అమెరికా ఎంబసీపై కూడా ఇరాన్ దాడి చేసింది. ఎంబసీ కాంపౌండ్ లోపల మంటలు, దట్టంగా పొగ కమ్ముకుందని కువైట్ రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. కువైట్‌లోని అమెరికాకు చెందిన అలీ అల్ సలేమ్ వైమానిక స్థావరాన్ని, హిందూ మహా సముద్రంలోని నౌకలను లక్ష్యంగా చేసుకున్నామని ఇరాన్ ఆర్మీ ప్రకటించింది. ఇజ్రాయిల్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్ హెడ్‌క్వార్టర్స్ లక్ష్యంగా కూడా దాడులు జరిపినట్లు రివల్యూషనరీ గార్డ్స్ బలగాలు తెలిపాయి. జెరూసలేంలో వరుస పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. అమెరికా దళాలకు సాయం చేస్తే దాడులు తప్పవని సౌదీ అరేబియా, యుఎఇ, ఖతార్, కువైట్, బహ్రైన్ దేశాలను ఇరాన్ హెచ్చరించింది.

కువైట్‌లో కూలిన అమెరికా యుద్ధ విమానాలు

పెద్ద సంఖ్యలో అమెరికా యుద్ధ విమానాలు కువైట్‌లో కూలిపోవడం కలకలం రేపింది. ప్రపంచవ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశమైంది. అయితే, కువైట్ పొరపాటున ఆ యుద్ధ విమానాలను కూల్చివేసినట్లు అమెరికా,ఇజ్రాయిల్ తేల్చాయి. 'ఫ్రెండ్లీగా కువైట్ చేసింది.' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు.

చమురు ట్యాంకర్‌ను ఢీకొట్టిన బోట్ : ఒక భారతీయుడు మృతి

మస్కట్ తీర ప్రాంతంలో చమురు ట్యాంకర్‌ను పేలుడు పదార్థాలతో నిండిన మానవ రహిత బోట్ ఒకటి ఢీకొంది. వెంటనే ఇంజన్ రూమ్‌లో పెద్ద పేలుడు సంభవించిందని, ఈ ఘటనలో భారతీయ సిబ్బంది ఒకరు మరణించాని వార్తలందాయి. మిగిలిన 21మంది సిబ్బందిని అక్కడ నుండి తరలించారు. ఈ మేరకు ఒమర్ రక్షణ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. బహ్రెయిన్ ఓడరేవులో నౌకపై రెండు క్షిపణులు పడ్డాయని బ్రిటన్ సముద్ర జల రవాణా సంస్థ తెలిపింది.

# బీజేపీ విధానాలపై యుద్ధానికి సిద్ధంకండి

మొదటి తరువాయి

యుద్ధానికి సిద్ధం కావాలని కాంగ్రెస్ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో తొమ్మిది రోజులపాటు కొనసాగిన తెలంగాణ, ఏపీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల (డీసీసీలు) శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి.

ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశాన్ని కూడా నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిళ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళికబద్ధంగా తీసుకోవాల్సిన చర్యలపై డీసీసీలకు రాహుల్‌గాంధీ దిశా నిర్దేశం చేశారు. అంతర్జాతీయ, జాతీయ రాజకీయాల్లో నెలకొన్న పరిణామాల గురించి ఆయన వారితో చర్చించారు. కాంగ్రెస్ పార్టీ అహింసా వాదాన్ని నమ్ముతూ రాజకీయాలు చేస్తుంటే.. బీజేపీ హింసావాదంతో ముందుకు సాగుతోందని విమర్శించారు. తాము గాంధేయ వాదాన్ని అనుసరిస్తే.. బీజేపీ, ఆర్ఎస్ఎస్ నేతలు గాడ్సే బాటలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారని దుయ్యబట్టారు. ప్రధాని మోడీ దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన దుర్మార్గాలన్నీ ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని చెప్పారు. వాటన్నింటినీ ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. డీసీసీ అధ్యక్షులే తమ పార్టీకి అసలైన సైన్యమని రాహుల్ గాంధీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. అందువల్ల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో వారి పాత్రను మరింత పెంచుతామని భరోసానిచ్చారు. ఏఐసీసీ దేశవ్యాప్త పిలుపులను నూటికి నూరుశాతం జయప్రదం చేయాలని సూచించారు. తెలంగాణ, ఏపీల్లోని సామాజికాంశాలపై అధ్యయనం చేయాలని అన్నారు. తెలంగాణలో పార్టీ, ప్రభుత్వం జోడెడ్లలాగా పని చేస్తున్నాయని కితాబిచ్చారు. సీనియర్ నేతలు, కార్యకర్తలు, నాయకులను కలుపుకుని ముందుకు పోవాలని రాహుల్ ఈ సందర్భంగా సూచించారు. అహాన్ని పక్కనపెట్టి పని చేయాలని హితవు పలికారు. 'ఇగో'ల కంటే పార్టీ ముఖ్యమనే విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. ఒక్కో డీసీసీ అధ్యక్షుడు మరో పదిమంది క్రియాశీలక నాయకుల్ని తయారు చేయాలని దిశా నిర్దేశం చేశారు. పని చేస్తున్న వారిని గుర్తించి, ప్రోత్సహించాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్‌తో క్లాస్‌డ

సమావేశంలో రాహుల్ గాంధీ మార్షల్ ఆర్ట్స్ చేస్తూ వినూత్నంగా సందేశమిచ్చారు. అందులోని మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితానికి అన్వయించుకోవాలని సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీకి ఒంటిపై ఒక బట్ట తప్ప ఏమీ ఉండదని గుర్తు చేశారు. అంతటి నిరాడంబరుణ్ని బ్రిటీష్ వారు సైతం ఏమీ చేయలేకపోయారని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలతో మమేకమై పని చేయాలని పిలుపునిచ్చారు. కష్టించి పని చేయండి.. రానున్న రోజులన్నీ మనవేనంటూ భరోసానిచ్చారు.

**కాంగ్రెస్ శివుడు.. బీజేపీ విష్ణువు**

ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీని శివుడితో పోల్చారు. తనలో సగభాగాన్ని భార్యకు ఇచ్చిన శివుడు, నిరాడంబరంగా ఉంటారని గుర్తు చేశారు. అదే రకంగా కాంగ్రెస్ పద్ధతి సాధారణంగా ఉంటుందని తెలిపారు. అందుకు భిన్నంగా బీజేపీ విష్ణువులాగా నగలు నట్రాతో ఆడంబరంగా, అత్యంత విలాసంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. వాటిని కాపాడుకోవటానికే ఆ పార్టీ ప్రజల మీద ఆయుధా(అధికారం)న్ని ప్రయోగిస్తోందని ఎద్దేవా చేశారు.

# హిందువులంతా ఐక్యంగా పోరాడాలి

మొదటి తరువాయి

మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు. ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తే అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం. అరాచకాలు, కూల్చివేతలు వెంటనే మానండి, ఇలాంటివి పునరావృతం అయితే మా ప్రణాళిక మేము సిద్ధం చేసుకుంటాం. గత 9 రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్టల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కొనసాగు వేశంలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నేతలకు దిశా నిర్దేశర చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఇక్కడికి వచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ రాహుల్ను ఉద్దేశిం చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# అమెరికాతో చర్చలు జరపం

మొదటి తరువాయి

సమాధానమిస్తూ 'చర్చలకు మేము ఎప్పుడూ సుముఖమే. అయితే మాపై దాడులు జరుగుతున్నాయి' అని బదులిచ్చారు. గత 12 నెలల కాలంలో అమెరికాతో రెండు సార్లు చర్చలు జరిపామని, అయితే ఆ రెండు సందర్భాలలోనూ చర్చలు సాగుతున్న సమయంలోనే తమపై దాడి చేశారని, అవి మాకు చేదు అనుభవాన్ని మిగిల్చాయని చెప్పారు.



## ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు



**పెద్దపల్లి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాదరావు గారి 89వ జయంతి వేడుకలు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మరియు సుల్తానాబాద్ పట్టణంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు గాంధీ విగ్రహం వద్ద పుష్పమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి జయంతి వేడుకలను జరిపారు. ఆయన మాట్లాడుతూ, శ్రీపాదరావు గారు ప్రజాసేవలో విశిష్టమైన పాత్ర పోషించారని, ఆయన ఆలోచనలు, విలువలు నేటి తరానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో కూడా వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు కృష్ణ, మార్కెట్ చైర్మన్ మినిపల్ ప్రకాష్ రావు, కూర మల్లారెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక సతీష్, భూషణవ్ సురేష్ గౌడ్, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫౌండేషన్ లర్నింగ్ స్టడీ మాక్ టెస్ట్ 3 నిర్వహించాలి

**- జి.పి.వి. రంగనాథ శర్మ**



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రామడుగు మండలంలో ఫౌండేషన్ లర్నింగ్ స్టడీ మాక్ టెస్ట్ c 3 నిర్వహించాలని మండల విద్యాధికారి జి.పి.వి. రంగనాథ శర్మ ప్రకటించారు. ఈ పరీక్షను తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా మూడవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ మరియు గణిత విషయాల్లో నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులు టాబ్లెట్‌ల ద్వారా ఆన్లైన్‌లో పరీక్షను నిర్వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు భౌతిక రూపంలో కాకుండా డిజిటల్ రూపంలో అందుబాటులో ఉంటాయని, ఉపాధ్యాయులు అందరూ ముందుగానే డెమో మరియు పీడీఎఫ్ ఫైల్‌ను అధ్యయనం చేసి, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని అంచనా వేసి, బలహీనతలను గుర్తించి, వారికి తగిన మార్గదర్శకత్వం ఇవ్వడం ఈ పరీక్ష ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు సమగ్రంగా సన్నద్ధం కావాలని, పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు.

## పోగొట్టుకున్న ఫోన్‌ను తిరిగి అందించిన పోలీసులు

**కరీంనగర్ రూరల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: జనవరి 28న గంగాధరకు చెందిన తిరుపతి తన ఐఒప్పో మొబైల్ ఫోన్ను తీగలగుట్టపల్లిలో పోగొట్టుకున్నాడు. ఈ విషయమై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేశారు. సీఐఆర్ టెక్నాలజీ సహాయంతో పోలీసులు ఫోన్‌ను జగిత్యాలలో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేశారు. అనంతరం సోమవారం నాడు రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి ఆ ఫోన్‌ను తిరుపతికి స్వయంగా అప్పగించారు. ఈ సందర్భంగా తిరుపతి పోలీసుల సేవలను ప్రశంసిస్తూ, తమకు అందించిన సహాయం మరువలేనిదని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పోలీసులు పనిచేయడం సమాజానికి ఆదర్శమని గ్రామస్థులు అభిప్రాయపడ్డారు.




# గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు

**పెద్దపల్లి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జూలపల్లి మండలం వెంకటరావుపల్లి నుండి కచపూర్ గ్రామం వరకు రూ.12 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు పరిశీలించారు. అనంతరం గ్రామ అభివృద్ధి కార్యక్రమాల భాగంగా స్కూల్ గోడ నిర్మాణానికి రూ.10 లక్షలు, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, స్వశక్తి మహిళా భవన నిర్మాణానికి రూ.10 లక్షల నిధులను మంజూరు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాలను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్య, మౌలిక సదుపాయాలు, మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతాయని ఆయన



పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ నుగిల్లా మల్లయ్య, పలు గ్రామాల సర్పంచులు మచ్చ అరుణ, మాజీ సర్పంచ్ దుగ్యాలా శామ్ రావు, పుల్లరి వేణుగోపాల్ రావు, పెంట కిషోర్, కనుకట్ల అంజి, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు బొజ్జ శ్రీనివాస్, మల్లెతుల కొమురయ్య, రాజేశ్వర్ రావు, లింగయ్య, హరికృష్ణ, సంతోష్, ఈర్ల స్వామి కార్యకర్తలు మరియు గ్రామస్తులు హాజరయ్యారు.

# ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు 89వ జయంతి వేడుకలు








**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మాజీ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు గారి 89వ జయంతి వేడుకలు జిల్లా కాంగ్రెస్ కార్యాలయం తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ముందుగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి వద్ద ప్రభుత్వం తరఫున ఆర్డీవో మహేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, అనుబంధ సంఘాల అధ్యక్షులు ఎండి తాజ్, కొరివి అరుణ్ కుమార్, కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, పర్వత మల్లేశం, వరాల నర్సింగం, గుమ్మడి రాజ్ కుమార్ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తరువాత కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ, అజాతశత్రువుగా పేరుపొందిన శ్రీపాదరావు గారు ఉమ్మడి రాష్ట్రానికి మాత్రమే కాకుండా ప్రతి ప్రాంతానికి సేవలు అందించారని, అందరి మన్ననలు పొందారని, ఆయన చూపిన బాటలో నడవడం తమకు గౌరవకరమని అన్నారు. ఆయన మరణానంతరం తనయుడు దుద్దిళ్ల శ్రీధర్ బాబు తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో తండ్రికి తగ్గ తనయుడిగా నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెన్న రాజ మల్లయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, టేల భూమయ్య, ఆకుల ఉదయ్, మంద నగేష్ ముదిరాజ్, మూల కృష్ణారెడ్డి, వంగల విద్యాసాగర్, విక్టర్, నాగుల సతీష్, చెర్ల పద్మ, పంజాల స్వామి గౌడ్, దిండుగాల మధు, మూల జయపాల్, మాదాసు శ్రీనివాస్, సత్తినేని శ్రీకాంత్, శిల్ప, జ్యోతి రెడ్డి, రాచర్ల పద్మ, లాయి, అబ్దుల్ భారీ, కుంభాల రాజ్ కుమార్, బషీరుద్దీన్, కాంపల్లి కీర్తి కుమార్, ఎర్ర శ్రీనివాస్, స్వప్న శ్రీ, ముక్క భాస్కర్, శ్రీరాముల రమేష్, దండు రవీందర్, సలీముద్దీన్, సిరికొండ శివప్రసాద్, జొన్నల రమేష్, కొట్టే ప్రభాకర్, మామిడి సత్యనారాయణ రెడ్డి, రూపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, సుంకరి గణపతి, ఊరడి లత, ములకల కవిత, మార్కరాజు, ఫజల్, అందే శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హోలీ వేడుకలు శాంతియుతంగా జరుపుకోవాలి

**- సీపీ గౌష్ ఆలం**




**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
: రంగుల పండుగ హోలీ సందర్భంగా కరీంనగర్ జిల్లా ప్రజలకు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సౌహార్దానికి, సోదరభావానికి ప్రతీక అని, ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో చట్టబద్ధంగా వేడుకలు జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక సూచనలు జారీ చేశారు. చర్మం, కళ్లకు హాని చేసే రసాయనిక రంగులు కాకుండా సహజ రంగులను మాత్రమే వాడాలని, ఇతరుల అనుమతి లేకుండా రంగులు లేదా నీరు చల్లడం నేరమని స్పష్టం చేశారు. మహిళలు, వృద్ధులు, పిల్లల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, బలవంతంగా రంగులు పూసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం పూర్తిగా నిషేధమని, ట్రిపుల్ రైడింగ్, మితిమీరిన వేగం, స్టంట్లు చేసే వారి వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. హోలీ సాకుతో మహిళలను వేధించే వారిపై నిఘా ఉంచేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను మోహరించినట్లు చెప్పారు. అనుమతి లేకుండా డీజే సౌండ్ సిస్టమ్స్ వాడరాదని, సోషల్ మీడియాలో పుకార్లు వ్యాప్తి చేసినా లేదా మతపరమైన ఉద్రిక్తతలు పెంచే పోస్టులు పెట్టినా ఐటీ చట్టం ప్రకారం కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. హోలీ కార్యక్రమాలు నిర్వహించే వారు స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. వేడుకల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా లేదా అత్యవసర సహాయం కావాలన్నా వెంటనే డయల్ 100కు కాల్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కమిషనర్ కోరారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి సురక్షితమైన హోలీ జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

# కలెక్టర్ చిత్ర మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవోలు నాయకులు

**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోలు సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సంఘ నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి, జిల్లా ఉద్యోగుల తరఫున హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అనంతరం 2026 సంవత్సరానికి సంబంధించిన టీఎన్జీవోలు సంఘ డైరీని అందజేశారు. మార్చి 7న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంకమ్మతోటలోని టీఎన్జీవోలు సంఘ భవనంలో నిర్వహించనున్న కార్యక్రమానికి కలెక్టర్‌ను ఆహ్వానించారు. మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవు ప్రకటించాలని కూడా కోరారు. ఉద్యోగుల సమస్యలపై కూడా చర్చించిన నాయకులకు కలెక్టర్



చిత్ర మిశ్రా సానుకూలంగా స్పందించారు. మహిళా దినోత్సవ కార్యక్రమానికి తప్పకుండా హాజరవుతానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జిల్లా పరిపాలన ఎల్లప్పుడూ సహకరిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో టీఎన్జీవోలు సంఘం జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీ చరణ్, అసోసియేట్ అధ్యక్షుడు ఒంటెల రవీందర్ రెడ్డి, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మీందర్ సింగ్, మహిళా నాయకులు శారద, సునీత, సబిత, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, తిమ్మాపూర్ అధ్యక్షుడు పోలు కిషన్, కార్యదర్శి నాగరాజు, ఇతర నాయకులు కోట రామస్వామి, శంకర్, రమేష్ గౌడ్, ప్రసాద్ రెడ్డి, పాలవేడు శ్రీనివాస్, విజయలక్ష్మి, హరిప్రియ, శైలజ, సరిత, స్వర్ణలత, రాజేష్, కరుణాకర్, లవ్ కుమార్, ప్రదీప్, పాండు, మల్కా రాజేశ్వరరావు, నగేష్ గౌడ్, శంషుద్దీన్, కయ్యం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గ్రామాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో పోలీసులు అక్రమ ఇసుక రవాణాను అడ్డుకున్నారు. బొమ్మకల్ గ్రామానికి చెందిన గన్ను రాకేష్ రెడ్డి, ఆస్తపురం విజయ్ తమ ట్రాక్టర్లలో మానేరు వాగు నుండి ఇసుకను దొంగలించి తరలిస్తుండగా, బొమ్మకల్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి తదుపరి చర్యల కోసం కోర్టుకు పంపించారూ. ఈ సందర్భంగా రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, అక్రమ ఇసుక రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు చట్టాన్ని గౌరవించి, అక్రమ రవాణా కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరం పరిష్కరించాలి

**- కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అధికారులు తమ స్థాయిలో ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో విచారించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. శాఖల వారీగా దరఖాస్తుల స్వీకరణ, పరిష్కారం, పెండింగ్ అంశాలను సమీక్షిస్తానని, దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 345 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మీ కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# వెటర్నరీ డాక్టర్స్ స్పోర్ట్స్ మీట్‌లో టీఎన్జీవో, టీజీవో నాయకుల ఘన సన్మానం



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తెలంగాణ వెటర్నరీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాత కరీంనగర్ జిల్లా వెటర్నరీ డాక్టర్స్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కరీంనగర్ ఉద్యోగ జేఏసీ చైర్మన్, టీఎన్జీవో అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, జేఏసీ కన్వీనర్, టీజీవో అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, టీఎన్జీవో కార్యదర్శి లక్ష్మణరావు హాజరయ్యారు. వెటర్నరీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. రఘుపతి రెడ్డి, జనరల్ సెక్రటరీ కమలాకర్, కోశాధికారి విజయ్ భార్గవ, వైస్ ప్రెసిడెంట్లు అజయ్, అశోక్, జిల్లా వెటర్నరీ అధికారి, కరీంనగర్ డా. లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ వినోద్ సమక్షంలో టీఎన్జీవో, టీజీవో అధ్యక్షులు, కార్యదర్శులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ నాయకులు, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు, వివిధ జిల్లాల వెటర్నరీ వైద్యులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగి, వెటర్నరీ వైద్యుల ఐక్యతను ప్రతిబింబించింది.

## బొమ్మకల్ 6వ డివిజన్ గౌడ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా బూస పెద్ద శ్రీనివాస్ గౌడ నియామకం



**కరీంనగర్ రూరల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బొమ్మకల్ 6వ డివిజన్ గౌడ కులస్తుల ఆధ్వర్యంలో సంఘం నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా బూస పెద్ద శ్రీనివాస్ గౌడ, ఉపాధ్యక్షుడిగా సుద్దాల పర్షరములు గౌడ, కోశాధికారిగా బూస అశోక్ గౌడ, ప్రధాన కార్యదర్శిగా గట్టు పవన్ గౌడ, సహాయ కార్యదర్శిగా కందుల శ్రీనివాస్ గౌడ, ప్రచార కార్యదర్శిగా సుధగోని వినయ్ గౌడ ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, కుల పెద్దలు పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరం పరిష్కరించాలి

**- కలెక్టర్ కె. హైమావతి**

**సిద్ధిపేట, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.



హైమావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అందజేసిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హతల మేరకు వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి మొత్తం 165 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. అంతకుముందు జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని గురుకులాలు, హాస్టళ్లలో భోజనం, వసతి తదితర అంశాలను పర్యవేక్షించడానికి జిల్లా, మండల స్థాయి అధికారులను నియమిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఎంసిపిఐయు కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైన మాదం తిరుపతి



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (యునైటెడ్) c ఎంసిపిఐయు పార్టీ కేంద్ర కమిటీ సభ్యునిగా మాదం తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆయన పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. ఫిబ్రవరి 23, 24 తేదీలలో రాజస్థాన్ రాష్ట్రం జోద్పూర్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి ఎంసిపిఐ (యు) పార్టీల ఐక్యత కన్వెన్షన్‌లో తనను కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నారని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతపరమైన ఘర్షణలకు దారితీస్తూ రాజకీయ ప్రయోజనాల కోసం కుట్రలు చేస్తోందని విమర్శించారు. ప్రజా పాలన, ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి కులం, మతం, ప్రాంతాల చుట్టూ విద్వేషపూరిత ప్రకటనలు చేస్తూ కాలం గడుపుతున్నారని అన్నారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీ తరఫున నిరంతరం పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

# ఇంటర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సోమవారం తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ వింగ్ కళాశాల, భగత్ నగర్‌లోని అల్ఫోర్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలు, సీసీ కెమెరా వ్యవస్థను పరిశీలించి, విద్యార్థుల హాజరు శాతం, హాల్ టికెట్ల తనిఖీ, బందోబస్తు ఏర్పాట్లపై ఆరా తీశారు. మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని సంబంధిత అధికారులను సూచించారు.

# చెట్టుకు ఉరి వేసుకుని యువకుడు మృతి

**నాగర్‌కర్నూల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోడేరు మండల తీగలపల్లి గ్రామంలో యువకుడు తెలుగు నరేష్ (26) చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన మొబైల్ ఫోన్ తస్కరణ ఘటనలో నరేష్‌పై ఆరోపణలు రావడంతో, ఆదివారం పంచాయతీలో తప్పు ఒప్పుకున్నాడని సమాచారం. అవమానంతో ఆత్మహత్య చేసుకున్నాడా, లేక హత్య చేసి ఉరివేసారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోస్ట్‌మార్టం నివేదిక అనంతరం వాస్తవాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు తెలిపారు.

# బీసీ రక్షణ చట్టం తేవాలని డిమాండ్

**- జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్**



**పెద్దపల్లి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బీసీలకు రక్షణ చట్టం తేవాలని పెద్దపల్లి బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్ డిమాండ్ చేశారు.తెలంగాణాలో రోజు రోజుకు బీసీలపై సామాజిక దాడులు, బహిష్కరణలు, వేధింపులు, హత్యలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న అనాగరిక చర్యలు, ఎన్నికల సమయంలో జరిగిన కిడ్నాప్‌లు, బెదిరింపులు, ఇబ్రహీంపట్నం మున్సిపల్ ఎన్నికల్లో బీసీ అభ్యర్థి కిడ్నాప్, జనరల్ స్థానాల్లో పోటీ చేసిన బీసీ అభ్యర్థులకు బెదిరింపులు, కుమ్మర మల్లన్న జాతరలో పసికందు హత్య వంటి ఘటనలు చూస్తే బీసీలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన పేర్కొన్నారు.ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంలా బీసీ రక్షణ చట్టం రూపొందించి అమలు చేయాలని, ఇందుకోసం ఉద్యమాలు చేపడతామని తెలిపారు. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో బీసీ రక్షణ చట్టం అమల్లోకి రానుందని, తెలంగాణలో కూడా బీసీలకు అండగా నిలిచేలా ప్రభుత్వం చట్టం చేయాలని ఆయన ఓ పత్రికా ప్రకటనలో కోరారు.

## ఉద్యోగుల ప్రోత్సాహానికి జిల్లా ఆసుపత్రిలో స్టార్ పెర్ఫార్మర్ అవార్డులు



**పెద్దపల్లి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా కలెక్టర్ సూచనల మేరకు పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి ప్రతినెల వారి పనితీరు ఆధారంగా స్టార్ పెర్ఫార్మర్ అవార్డు అందజేస్తున్నారు.మార్చి నెలకు గాను ఫీమేల్ నర్సింగ్ ఆర్డర్లీగా పనిచేస్తున్న ఎన్. మాధవి, శానిటేషన్ విభాగంలో ప్రతిభ కనబర్చిన బి. విజయలకు స్టార్ పెర్ఫార్మర్ అవార్డు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్, ఆర్.ఎం.ఓ డా. విజయ్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ జమున, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## అర్జీలు సత్వరం పరిష్కరించాలి

**- కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన పి. ఓదెలు వారసత్వ భూమి తన పేరుమీద మార్చి పట్టా పాస్‌బుక్ జారీ చేయాలని కోరగా, తహసిల్దార్ మంథని క్షేత్రస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. పెద్దపల్లి పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన బి. శ్యామల, అలాగే రంగంపల్లి నివాసి కే. కవిత డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల మంజూరుకు దరఖాస్తు చేయగా, పీడీ హౌసింగ్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా బానోతు రాజేష్ నాయక్ తన కుమారుడు బానోతు రెడ్యా నాయక్ సీఎం కప్పు క్రీడా పోటీల్లో గాయపడినందుకు చికిత్స కోసం ఆర్థిక సహాయం కోరగా, డివైఎస్ఓకు రాస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# క్రీడలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**మానకొండూర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రోత్సాహం ఇవ్వడం లేదని బీజేపీ కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రాల వెంకటరెడ్డి విమర్శించారు.ప్రధాన మంత్రి సంసద్ క్రీడా మహోత్సవం సందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ స్థాయిలో సోమవారం మానకొండూర్ జడ్పీ పాఠశాలలో క్రీడలను నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకొని జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి తో కలిసి పోటీలను ప్రారంభించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు.క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విద్యా రంగంలో రిజర్వేషన్ లభిస్తుందని, క్రీడల ద్వారా దేహదారుఢ్యం పెరుగుతుందని వెంకటరెడ్డి పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుండే క్రీడలపై శ్రద్ధ చూపేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, క్రీడలను



ప్రోత్సహించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గ స్థాయి నుండి పార్లమెంట్ స్థాయి వరకు ఇటువంటి క్రీడలను నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఎంపీలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో ఈ క్రీడలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. క్రీడల నిర్వహణపై జిల్లా సీనియర్ నాయకుడు గుజ్జ శ్రీనివాస్ పరిశీలించారు. పోటీలకు అంపైర్లుగా సంపత్, అనిల్, శ్రీధర్, వెంకటేష్, అరవింద్ వ్యవహరించారు. కార్యక్రమంలో మానకొండూర్ అధ్యక్షుడు కంది రాజేందర్ రెడ్డి, కేశవపట్నం అధ్యక్షుడు ఎనుగుల అనిల్, తిమ్మాపూర్ అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, గన్నేరువరం అధ్యక్షుడు తిప్పర్తి నికేష్, జిల్లా నాయకులు భాషబోయిన ప్రదీప్, దూలం కిరణ్, బోనాల మోహన్, గడ్డం అరుణ్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, అశ్విన్, ఉషాకోయిల రమేష్, అరెల్లి శ్రీహరి, శీలం కుమార్ యాదవ్, వీరగోని రాజు, రేగూరి సుగుణాకర్, మాదాసు కుమార్, రాచమల్ల శ్రీనివాస్, సాయి లు తదితరులు పాల్గొన్నారు.

## పద్నాలుగోవ రోజుకు చేరిన ఏషియన్ పెయింట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్ల నిరసనలు

**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గత పద్నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ఏషియన్ పెయింట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు తమ సమస్యలపై యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ సోమవారం తలకిందులుగా నిరసన తెలిపారు.సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ, ఏషియన్ పెయింట్ గోదాంలో వెంకట్ లాజిస్టిక్, నాగభూషణం ట్రాన్స్పోర్ట్ ఏజెన్సీల వద్ద అరవై మంది డ్రైవర్లు గత పది సంవత్సరాలుగా తమ సొంత వాహనాలతో సరఫరా పనులు చేస్తూ, లోడింగ్‌-అన్‌లోడింగ్ పనులు కూడా నిర్వహిస్తున్నారని, ఇప్పటివరకు వాహనాలకు అగ్రిమెంట్ లేకపోవడం నిబంధనలకు విరుద్ధమని తెలిపారు. డ్రైవర్లను బానిసలుగా చూస్తూ హమాలి చార్జీలు చెల్లించకుండా మోసం చేస్తున్నారని, వెంటనే వాహనాలకు అగ్రిమెంట్ చేయాలని, శ్రమదోపిడి, వెట్టి చాకిరి నుంచి విముక్తి కల్పించాలని డిమాండ్





చేశారు.యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కీసర మల్లేశం మాట్లాడుతూ, సమ్మె పద్నాలుగోవ రోజుకు చేరిందని, వరంగల్, హైదరాబాద్ తదితర జిల్లాల్లో డ్రైవర్లకు లోడింగ్‌-అన్‌లోడింగ్ చార్జీలు చెల్లిస్తున్నప్పటికీ కరీంనగర్‌లో మాత్రం యాజమాన్యం అన్యాయంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఏషియన్ పెయింట్స్ కంపెనీ అందిస్తున్న సౌకర్యాలను డ్రైవర్లకు ఇవ్వకుండా యజమాన్యం డబ్బులు దండుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.సరుకు రవాణా కోసం బయట వాహనాలను తీసుకువచ్చి డ్రైవర్ల మధ్య గొడవలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని, సమస్యలు పరిష్కరించే వరకు నిరసనలు, ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. డ్రైవర్లకు పది లక్షల ప్రమాద భీమా ఏషియన్ పెయింట్స్ కంపెనీ బాధ్యతగా కల్పించాలని కూడా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కామల్ల మహిపాల్, కోశాధికారి ఉత్తమల్ల వెంకటేశ్, సహాయ కార్యదర్శి మూగ తిరుపతి, లింగంపల్లి అనిల్, ముచ్చర్ల రాజశేఖర్, ఏ. రవి, కే. మహేష్, ఏ. రమేష్, సిహెచ్. రాజేష్, మహేష్, విజయ్, వెంకటేశ్, శ్రీనివాస్, నరేష్, మధు, కళాధర్, శ్రీకాంత్, రాజు, మోహన్, రాజశేఖర్ తదితర నలభై మంది ట్రాన్స్పోర్ట్ డ్రైవర్లు పాల్గొన్నారు.

# మైలారం మైసమ్మ గుట్ట ప్రాంతంలో బ్రిడ్జ్ నిర్మాణానికి సర్పంచుల మద్దతు

**గన్నేరువరం, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బ్రిడ్జ్ జేఏసీ చైర్మన్ ఆహ్వానం మేరకు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు మైలారం మైసమ్మ గుట్ట ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైలారం నుండి కరీంనగర్ సప్తగిరి కాలనీ వరకు మానేరు పైన బ్రిడ్జ్ నిర్మాణం జరగడం వల్ల అన్ని గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. బ్రిడ్జ్ నిర్మాణం మైలారం మైసమ్మ గుట్ట నుండి సప్తగిరి కాలనీ స్మశాన వాటిక వరకు జరగాలని సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ తమ గ్రామపంచాయతీల తీర్మాణాలను బ్రిడ్జ్ జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్‌కు అందజేశారు. వేరే చోట బ్రిడ్జ్ నిర్మాణం చేపడితే ప్రజా పోరాటానికి సిద్ధమని హెచ్చరించారు.సంపతి ఉదయ్ మాట్లాడుతూ, మండలంలోని సర్పంచులు మైలారం నుండి సప్తగిరి కాలనీ వరకు బ్రిడ్జ్ నిర్మాణానికి మద్దతుగా తీర్మానం చేయడం బ్రిడ్జ్



జేఏసీ ఉద్యమానికి, ప్రజాభిప్రాయానికి బలం చేకూర్చిందని అన్నారు. మానేరు డ్యామ్ నిర్మాణానికి భూములు కోల్పోయిన వారికి న్యాయం జరుగుతుంది. ప్రభుత్వం సేకరించిన వందల ఎకరాలు ఇతర అవసరాలకు వినియోగించుకోవచ్చు. గన్నేరువరం ప్రజలకు కరీంనగర్ కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో చేరువ అవుతుంది. మైలారం-బెజ్జంకి రూట్‌లో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన డబుల్ రోడ్ నిర్మాణం జరుగుతుండడంతో హైదరాబాద్ వెళ్లే కరీంనగర్ ప్రజలకు సుమారు ముప్పై కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. స్వయంభు మల్లికార్జున స్వామి, మానసా దేవి, లక్ష్మి గణపతి ఆలయాలను దర్శించుకునే భక్తులకు సౌకర్యం కలుగుతుంది. ప్రభుత్వం ఆధీనంలో భూములు ఉండటంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి భూమి సేకరణ అవసరం తక్కువగా ఉంటుంది. కావున కేంద్రమంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్థబి అధికారులు ప్రజాభిప్రాయానికి విలువనిస్తూ మైలారం నుండి సప్తగిరి కాలనీ వరకు మానేరు పైన బ్రిడ్జ్ నిర్మించాలని కోరారు. లేని పక్షంలో పోరాటం నిరంతరంగా కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో కరాటే బెల్ట్ సర్టిఫికెట్ల ప్రధానోత్సవం

**మిర్యాలగూడ, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ నియోజకవర్గంలోని రైస్ మిల్ అసోసియేషన్ వద్ద సోమవారం కరాటే బెల్ట్ సర్టిఫికెట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ప్రధాన అతిథులు విద్యార్థులకు బెల్ట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. క్రీడల ద్వారా క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని, యువత క్రీడలలో రాణించి





రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.ఈ వేడుకలో సినీ ప్రముఖుడు సుమన్, ఎమ్మెల్సీ మరియు ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ కేతవత్ శంకర్ నాయక్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. అలాగే నూతనంగా ఎన్నికైన మున్సిపాలిటీ చైర్మన్ చిలుకూరి సుధ బాలు, వైస్ చైర్మన్ గుడిపాటి క్రాంతి నవీన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో సహజ రంగులతో హోలీ సంబరాలు




**హుస్నాబాద్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో హోలీ పండుగను సహజ సిద్ధమైన మొక్కల నుండి తయారుచేసిన రంగులతో జరుపుకోవాలని విద్యార్థులలో చైతన్యం కలిగించేందుకు బోటనీ విభాగం, పర్యావరణ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ విజయగిరి బిక్షపతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తక్కువ ఖర్చుతో, ఎటువంటి దుష్ప్రభావాలు లేని పర్యావరణహిత రంగులను మాత్రమే వాడి హోలీ సంబరాలు జరుపుకోవాలని సూచించారు. కుటుంబమంతా సుఖసంతోషాలతో ఉండేలా సహజ రంగులను ఉపయోగించాలని, హోలీ వేడుకల్లో కోడిగుడ్లను వాడరాదని విద్యార్థులను కోరారు.బోటనీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బాలరాజు ఆధ్వర్యంలో సైన్స్ విద్యార్థులు మోదుగ పూలు, బంతిపూలు, మందార ఆకులు, పూలను మెత్తగా రుబ్బి నీటితో కలిపి సహజ రంగులను తయారు చేశారు. ఆ రంగులతో విద్యార్థులు హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, డాక్టర్ ఇందిరా నాయనా దేవి, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ షబ్బీ ఫాతిమా, సుధా మాధురి, కుమారస్వామి, రాజ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ చిత్ర మిశ్రా సమక్షంలో బేటి బచావో బేటి పడావో పథకం పోస్టర్ ఆవిష్కరణ



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బేటి బచావో బేటి పడావో పథకంలో భాగంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాల పోస్టర్లను జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా సోమవారం ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టం, పీసీపీఎన్‌డీటీ యాక్ట్, చైల్డ్ హెల్ప్‌లైన్ పోస్టర్లను ఆవిష్కరించారు. అదేవిధంగా పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన పెంపొందించేందుకు సిద్ధం చేసిన ప్రదర్శన బోర్డులను కూడా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం. సరస్వతి, సఖి కేంద్రం అడ్మిన్ లక్ష్మి, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

## శిశు మందిర్ విద్యార్థులకు సి.ఎ కోర్స్ పై అవగాహన సదస్సు



**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
స్థానిక సరస్వతి శిశు మందిర్ ఇ.మీ. హై స్కూల్‌లో ది ఇన్స్టిట్యూట్ అఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ అఫ్ ఇండియా ఆధ్వర్యంలో విద్యార్థులకు సి.ఎ కోర్స్ పై అవగాహన సదస్సు జరిగింది. ప్రధాన వక్తగా తణుకు మహేష్ పాల్గొని, ప్రస్తుత కాలంలో సి.ఎ కోర్స్‌కు దేశ విదేశాల్లో విశేష గుర్తింపు ఉందని, కృషి మరియు పట్టుదలతో ఈ కోర్స్‌లో విజయం సాధించడం సాధ్యమని విద్యార్థులను ప్రోత్సహించారు. సి.ఎ పూర్తి చేసిన వారికి బ్యాంకులు, ప్రైవేట్ సంస్థలు, మల్టీ నేషనల్ కంపెనీలలో విస్తృత అవకాశాలు ఉన్నాయని వివరించారు.ఈ కార్యక్రమంలో గందె శ్రీనివాస్, శేఖర్ రెడ్డి, ఎంసీ మెంబర్ రామిడి సంతోష్ పాల్గొన్నారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సదస్సు భవిష్యత్తులో సి.ఎ చేయడానికి మార్గదర్శకంగా నిలుస్తుందని పాఠశాల కార్యదర్శి కోల అన్నా రెడ్డి, ప్రధానాచార్యులు సముద్రాల రాజమౌళి తెలిపారు.

# వైద్యరత్న బంగారు నంది అవార్డు అందుకున్న డా. ధర్మ నాయక్

**హుస్నాబాద్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ మండలం బల్లునాయక తండాకు చెందిన డా. లావుడ్య ధర్మ నాయక్, గత 11 సంవత్సరాలుగా హుస్నాబాద్ పట్టణంలోని సురక్ష హాస్పిటల్ ద్వారా స్థానిక ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తూ, సామాన్యులకు కూడా అందుబాటులో ఉండేలా వైద్య సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల్లో విశేష గుర్తింపు పొందారు.వారి సేవలను గుర్తించి హైదరాబాద్‌కు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ వారు బంగారు నంది అవార్డును ప్రదానం చేశారు. నిన్న హైదరాబాద్ బిర్లా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్ శిరీష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ సినీ నిర్మాతలు, రాజకీయ ప్రముఖుల సమక్షంలో



అంబికా కృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డు అందజేశారు.ఇంతకుముందు కూడా డా. ధర్మ నాయక్ అనేక ప్రశంసలు పొందారు. 2014లో హుస్నాబాద్ నియోజకవర్గ ఉత్తమ వైద్యుడిగా మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ చేతుల మీదుగా సత్కారం పొందారు. 2018లో దుబ్బాక మాజీ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. 2021లో కోవిడ్ సమయంలో ఎల్లారెడ్డిపేట మండల ఉత్తమ వైద్యుడిగా మాజీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా సత్కారం పొందారు.ప్రజా సేవలో విశేష కృషి చేసి, వైద్యరత్న బంగారు నంది అవార్డుతో గౌరవించబడిన డా. ధర్మ నాయక్ స్థానిక ప్రజలకు ఆదర్శంగా నిలిచారు.

# క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడంలో పీఎం సంసద్ ఖేల్ మహోత్సవం దోహదం

**కరీంనగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
క్రీడాకారుల ప్రతిభను గుర్తించడానికి, చాటి చెప్పడానికి ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవం ఎంతో దోహదపడుతుందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడానికి కట్టుబడి పనిచేస్తుందని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సునీల్ రావు అన్నారు.సోమవారం కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ క్రీడా పోటీలు స్థానిక అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రీడా మహోత్సవ కన్వీనర్ గుజ్జ శ్రీనివాస్, అసెంబ్లీ కమిటీ సభ్యులు తణుకు సాయి కృష్ణ, కడార్ల విమల్, జాడి బాల్ రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, నక్క ప్రమోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలకు డిప్యూటీ మేయర్ సునీల్ రావు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా



కబడ్డీ, కోకో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించబడ్డాయి. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు భూపతి రవీందర్, సౌ గాని కొమురయ్య, చొప్పరి జయశ్రీ, బండ రమణారెడ్డి, సోమిడి వేణు, ఏపీపీ చంద్ర, మాసం గణేష్, నాంపల్లి రేణుక శ్రీనివాస్, పొన్నం లక్ష్మీ మొండయ్య, కొంపెల్లి శ్వేతా రమన్, గొట్టేముక్కల ఉమారాణి వెంకట రమణ, గుగ్గిళ్ళపు మంజుల రమేష్, కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ వరాల జ్యోతి పాల్గొన్నారు.కరీంనగర్ అసెంబ్లీ పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 200 మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కార్యకర్తలు కటకం లోకేష్, గుంజేటి శివకుమార్, రమణారెడ్డి, పురం హరి, అడిచర్ల రాజు, సునీత, తేజస్వి, అశ్విని, వినీత్, రమేష్, సూర, సాయినాథ్, శ్రవణ్, నవీన్, శ్రీరాములు, అఖిల్, అక్షయ్, చిట్టిబాబు, పైడ రవి, నాంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.క్రీడాకారుల కోసం వన్ ఆస్పత్రి వైద్య సిబ్బంది, యుపిఎస్ కట్టరాంపూర్ హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

# విశ్వహిందూ పరిషత్ గో వంశ రక్షక సంవర్ధన సమావేశం

**మంచిర్యాల, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం, దండేపల్లి మండల గో వంశ రక్షణ సంవర్ధన సమితి సమావేశం వెంకట్రావుపేటలోని కింగ్స్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర గోశాల సంపర్క ప్రముఖ్ ఊట్కూరి రాధాకృష్ణ రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా గోమాతను జాతీయ ప్రాణిగా గుర్తించాలని, అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ప్రతి ఇంటిలో గోమాతను పెంచుకోవాలని, రైతులు గో ఆధారిత వ్యవసాయం చేయడం ద్వారా మానవాళిని రక్షించుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధశాలలను మూసివేయాలని, 1977 గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.గోవులను తరలించే వాహనాల్లో నియమాలను పాటించాలని, బొలెరో వాహనంలో రెండు గోవులు, డీసీఎం వాహనంలో నాలుగు



గోవులు మాత్రమే ఉంచాలని, వాహనాల్లో నీటి తొట్టి, గడ్డి ఏర్పాటు చేసి గోవుల మధ్య రెండు అడుగుల దూరం ఉండేలా చూడాలని వాహన యజమానులు, డ్రైవర్లకు సూచించారు. రాత్రి సమయంలో గోవులను తరలించే వాహనాల్లో డ్రైవర్ల లైసెన్స్, వాహన డాక్యుమెంట్లు సరిగా చెక్ చేయాలని ఆర్‌టీఓ అధికారులను కోరారు.లక్షెట్టిపేట మండల గోరక్ష కమిటీని ఆత్రం శశాంక్ ప్రముఖ్‌గా, రాజ్‌కుమార్, సన్నీ, దినేష్, జగన్ సభ్యులుగా ప్రకటించారు. దండేపల్లి మండల కమిటీలో బొమ్మెన మహేష్ ప్రముఖ్‌గా, ముత్తే భీమేష్, కస్తూరి లక్ష్మణ్, దూట సాయి, ముత్యాల శ్రీనివాస్, కుమ్మరి వినోద్, శ్రీకాంత్ సభ్యులుగా నియమించారు. పూర్తి స్థాయి కమిటీని త్వరలో ఏర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ కరీంనగర్ నగర అధ్యక్షుడు రమేష్, మంచిర్యాల జిల్లా గోరక్ష ప్రముఖ్ దూట రాజసమయ్య, కొండ నరేష్, వేముల మధు, నాగిరెడ్డి హేమంత్ రెడ్డి, మోటపల్కుల సతీష్, సామ వెంకటరమణ, లకవత్ ఈశ్వర్, వెంకటేష్, సుదీర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గద్దర్ విగ్రహ ఆవిష్కరణ సభను విజయవంతం చేయండి

**ఆమనగల్లు, మార్చి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి లో మార్చి 8వ తేదీన కల్వకుర్తి లో జరిగే గద్దర్ విగ్రహ ఆవిష్కరణ సభను విజయవంతం చేయాలని విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ శర్మ ఆధ్వర్యంలో ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామంలో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారు కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా గోడపత్రికను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు రజిత, బిక్షపతి, భోజన నాయకులు దుబ్బ సుధాకర్, బుజ్జయ్య, సాత్రి నరసింహ, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



# వివిధ కేసుల్లో ఎనిమిది మంది బైండోవర్



**కరీంనగర్ రూరల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వివిధ కేసుల్లో ఎనిమిది మందిని బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.ఇటీవల అక్రమంగా పిడిఎస్ బియ్యం తరలిస్తున్న గంట మల్లేష్, గంట లక్ష్మణ్‌లను, అలాగే అక్రమంగా ఇసుకను తరలిస్తున్న గన్ను రాకేష్ రెడ్డి, ఆస్తపురం విజయ్, నాగపురి అజయ్, నాగపురి రమేష్, పోలు గణేష్, బిజిలి చందు లను తహసీల్దార్ ముందు హాజరు పరిచి లక్ష రూపాయల పూచికత్తుపై బైండోవర్ చేశారు.ఇకపై ఎవరైనా చట్టవ్యతిరేక పనులకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# పెళ్లి కానుకగా విద్యార్థులకు శుభవార్త చెప్పిన విజయ్ దేవరకొండ



**అచ్చంపేట, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నాగర్‌కర్నూల్ జిల్లా బలమూరు మండలం తుమ్మలపేట గ్రామంలో విజయ్ దేవరకొండ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గృహప్రవేశం, సత్యనారాయణ వ్రతం, పెళ్లి విందు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. పెదనాన్న విటల్ రావు, చిన్నాన్న ప్రకాష్ రావు, మేనత్తలు భాగ్యమ్మ, లలితమ్మ, అనిత, రజితతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వగ్రామంలో రిసెప్షన్ కార్యక్రమం నిర్వహించడానికి ప్రధాన కారణం విజయ్ దేవరకొండ తల్లిదండ్రుల సూచన అని తెలిపారు. విందు కార్యక్రమాన్ని చూడటానికి చుట్టుపక్కల గ్రామాల నుండి అభిమానులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి నూతన దంపతులను చూసి ఆనందించారు.ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, ట్రస్ట్ ద్వారా విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేయనున్నట్లు ప్రకటించారు. అచ్చంపేట డివిజన్‌లోని 44 ప్రభుత్వ పాఠశాలల్లో 9వ, 10వ తరగతుల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వనున్నట్లు తెలిపారు.కార్యక్రమానికి రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం సందర్భంగా నేడు రామేశ్వరం ఆలయం మూసివేత



**ఫరూక్‌నగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చంద్రగ్రహణం సందర్భంగా రామేశ్వరం శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానం మంగళవారం ఉదయం 7 గంటల నుండి బుధవారం ఉదయం 5 గంటల వరకు మూసివేయబడుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి శివకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.గ్రహణం అనంతరం ఆలయములు శుద్ధి చేసి సంప్రోక్షణ నిర్వహించి, భక్తులకు దర్శనాలు, అభిషేకాలు తిరిగి ప్రారంభమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ఆలయ నియమాలను గౌరవించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ నేత శ్రీధర్ రెడ్డి కి ఎమ్మెల్యే నివాళి



**ఆమనగల్లు, మార్చి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
ఆమనగల్లు మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నేత కన్ను శ్రీధర్ రెడ్డి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయన మృత దేహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి అభివృద్ధికి సహకరించాలి

**మున్సిపల్ చైర్‌పర్సన్**



**కల్వకుర్తి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ భగవత్ సంతోష్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కోరారు. సోమవారం కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్‌ను సన్మానించి, పట్టణ సమస్యలను వివరించారు.ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శానవాజ్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అందె మోహన్‌కు ఘన సన్మానం



**షాద్‌నగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
షాద్‌నగర్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన 14వ వార్డు కౌన్సిలర్ అందె మోహన్‌ను సోమవారం సామాజిక కార్యకర్త నీల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అత్యధిక మెజారిటీతో విజయం సాధించి వైస్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన యువ నాయకుడిని శాలువాతో కప్పి, మెమెంటో అందజేశారు.ఈ సందర్భంగా నీల రవీందర్ మాట్లాడుతూ, “అందె మోహన్ వార్డు అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. ఇప్పుడు మున్సిపాలిటీ మొత్తానికి సేవలు విస్తరించడం సంతోషకరం. సేవా దృక్పథంతో పనిచేయాలని ఆకాంక్షిస్తున్నాం” అని అన్నారు.సన్మాన కార్యక్రమంలో ఎల్కుర్తి నారాయణ, హన్మారి మురళీధర్, శ్యాంసుందర్, భక్తవత్సల్, నిరంజన్, మల్లేష్, అభిలాష్, వేణు, తేజ, ప్రదీప్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.అందె మోహన్ మాట్లాడుతూ, “తనపై నమ్మకంతో గెలిపించిన 14వ వార్డు ప్రజలకు, వైస్ చైర్మన్‌గా ఎన్నుకున్న అందరికీ కృతజ్ఞతలు. ముఖ్యంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు. షాద్‌నగర్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను” అని హామీ ఇచ్చారు.

# చర్చిని ప్రారంభించిన ఎంపీ మల్లు రవి

- ఆకుతోటపల్లి లో ఘనంగా 102 హోమ్ మిషన్ వేడుక
- క్రైస్తవ సోదరులందరికీ ఎల్లవేళలా అండగా ఉంటా
- ఎంపీ మల్లురవి




**ఆమనగల్లు, మార్చి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని క్రైస్తవ సోదరులందరికీ ఎల్లవేళలా ఉండి,తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు సోమవారం ఆకుతోటపల్లి గ్రామంలో 102 హోమ్ మిషన్ సెలబ్రేషన్స్ రెవరెండ్ జి సి కృపయ్య మెమోరియల్ వింగ్ చర్చి ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఎంబీ జీ సీ అధ్యక్షులు ఐపీ ఆశీర్వాదం జీసీ ప్రధాన కార్యదర్శి జీకే రూపస్, పాస్టర్ వరప్రసాద్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లురవి మాట్లాడుతూ.. ఆకుతోటపల్లి గ్రామంలో 102 సంవత్సరాలు క్రిందట ఎంబీ మిషన్ ప్రారంభం కావడం గొప్ప విశేషం అన్నారు . నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో దాదాపు సంఘాలు పెద్దవి ఉన్నాయని తెలిపారు. ఆ సంఘాలన్నిటికీ ఒక ప్రధాన పాస్టర్ గా ప్రజలు నాకు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. వాటన్నిటిని కాపాడడం కోసం ఎ ప్పుడు ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, సర్పంచి న్యాలపట్ల నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ సుధీర్, మాజీ జెడ్పిటిసి శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నిట్ట నారాయణ, మాజీ సర్పంచి ప్రమోద్ కుమార్, సంఘ పెద్దలు జీకే లాజర్, బిన్నీ, రామచంద్రయ్య, విజయ్, నరసింహ, కాంగ్రెస్ నాయకులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, గుర్రం కేశవులు, యాట నరసింహ,జగన్,అలీం, విజయ్ నాయక్, ఫరీద్, నాజర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం



**కడ్తాల్, మార్చి 2 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :**
కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామంలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసా గుతున్నాయి. ఆదివారం రాత్రి స్వామి వారి రథోత్సవం కనువపండువగా కొనసాగింది. వేదపండితులు తిరుమల వింజమూరి రామానుజా చార్యుల వేదమం త్రోచ్చరణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను ఊరేగించారు.
వెంకటేశ్వర స్వామి నామస్మరణతో భక్తులు ఇరువైపులా రథాన్ని లాగారు. రథోత్సవం సందర్భంగా ఎటు వంటి ఇబ్బందులు కలుగకుండా ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొప్పిడి గోపాల్, ఉప సర్పంచ్ బందరి యాదయ్య, వార్డు సభ్యులు రవికుమార్, భూపతి, మాజీ ఎంపీటీసీలు యాదయ్య, రంగయ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రమేష్ యాదవ్, నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం సందర్భంగా మైసిగండి మైసమ్మ ఆలయం మూసివేత



**కడ్తాల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చంద్రగ్రహణం పురస్కరించుకుని మైసిగండి మైసమ్మ ఆలయాన్ని మంగళవారం ఉదయం 7 గంటలకు మూసివేయనున్నట్టు ఆలయ ఈవో స్నేహలత, ట్రస్టీ శిరోలి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.గ్రహణం అనంతరం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించి, మార్చి 4వ తేదీ ఉదయం 6 గంటలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనానికి అనుమతి ఇవ్వబడుతుందని వారు పేర్కొన్నారు.భక్తులు ఆలయ నియమాలను గౌరవించి సహకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

# కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో సంక్షేమానికి స్వర్ణయుగం

-కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి హోళీ అభిమానాన్ని చాటిన మహిళలు
-ప్రజాభిమానం ఉన్న నాయకుడు కేసిఆర్
-సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి




**కడ్తాల్, మార్చి 2 ( నీలగిరి ఎక్స్ ప్రేస్ ) :** రంగారెడ్డి జిల్లా, కడ్తాల్ మండల కేంద్రంలో ముందస్తు హోళీ వేడుకలు కేసీఆర్ చిత్రపటంతో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. కడ్తాల్ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ ,సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం మాదిరిగా ఏర్పాటుచేసిన ముందస్తు హోళీ వేడుకలలో కేసీఆర్ చిత్ర పటానికి కేసీఆర్ అభిమానులు,మహిళలు,బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కేసీఆర్ చిత్రపటానికి రంగులు చల్లి అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ మహిళా సంక్షేమ పథకాలు కేసీఆర్ హయాంలోనే బాగున్నాయని, కేసిఆర్ జిందాబాద్ అంటూ,మళ్ళీ కేసీఆర్ ఏ కావాలి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ హోళీ వేడుకలలో కేసీఆర్ అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కెసిఆర్ గారికి తమ అభిమానాన్ని చాటడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ,వార్డు సభ్యుడు రవి నాయక్, ఉద్యమకారుడు లక్ష్మణ చారి,గురిగళ్ల రామచంద్రయ్య,మూడ అశోక్,మిర్యాణం సంతోష్,అమృతం పాండు,మహేష్, సురేష్, ప్రశాంత్, కరుణాకర్,రాఘవ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రంగుల పండుగ హోళి



రంగు రంగుల పండుగ హోళి
రంగుల హోళి జీవన కేళి
ప్రాచీనమైన పండుగ హోళి
పాటల పండుగ హోళి
ఆనందాల పండుగ హోళి!!


మోదుగు పూలచే రంగులతో ఆటపాట
పిల్లల పాటల హోళి
పొద్దంతా పాటల పండుగ
రంగుల హరివిల్లు హోళి!!

తెలంగాణ యాసలో పాటల హోళి
వసంత ఋతువు రాకతో వచ్చే పండుగ
పాటలతో మొదలయ్యే పండుగ
పది రోజుల పాటల పండుగ

మగవారు కొలలతో ఆట ఆడే పండుగ
స్త్రీల చప్పట్లతో పాటల పండుగ
ప్రకృతితో ముడిపడిన పండుగ హోలీ
పల్లె పల్లె నా పాటల పండుగ!!

## రచన:-

దేవులపల్లి రమేశ్
కలం :వామిక శ్రీ వర్ష
నంగునూర్, సిద్దిపేట
9963701294



# చెడును దహనంచేసి ప్రేమనుపంచే హోళీ

హోళి పండుగ సందర్భంగా... 2026.




దేశవ్యాప్తంగా,విభిన్న రాష్ట్రాలల్లో జరుపుకునే వివిధ పండుగలకు చారిత్రిక నేపథ్యాన్ని పరిశీలిస్తే ...సాంప్రదాయాలతోపాటు,శాస్త్రీయంగా ప్రజలకు ఎంతో ఉత్సహాన్నిస్తూ, ఆనందాన్నిస్తూ, మానవసంబంధాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, మేలుజరిగే విదంగా ఉన్నాయి.ఇప్పటికి ప్రజలు వాటిని ఆదరిస్తూ, సంస్కృతి, ఆచారసాంప్రదాయాలకు విలువనిస్తూ, కొనసాగిస్తున్నారంటే వాటి ప్రాధాన్యతేంటో తెలియకనే తెలియజేస్తుంది ...కానీ కాలక్రమేణా పరిణామంలో భాగంగా వాటిని ఎలా మారుస్తున్నారో ...ఆలోచించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది.నేడున్న పరిస్థితుల్లో ఇంత అంగరంగ వైభవంగా జరుపుకుంటున్న హోళీ యొక్క చారిత్రిక నేపథ్యం తెలిసిన వారున్నారంటే చాలా తక్కువని చెప్పవచ్చు.హోళియొక్క చారిత్రిక నేపత్యాన్ని పరిశీలిస్తే రకరకాలుగా ఉన్నది ..అందులో కొన్నింటిని చూస్తే ఈ పండుగను జరుపుకోవడాని గల కారణం రాక్షసులకు రాజైన హిరణ్యకశ్యపుడు,చాలాకాలం తపస్సుచేసి మరణం లేనివిదంగా బ్రహ్మచే వరంపొంది ..పగలు లేక రాత్రీ,భూమిపైనా,ఆకాశములో,ఇంటిలోపల మరియు బయట,జంతువులవలన, అస్త్రములు,శస్త్రములచే చావులేకుండా వరంపొంది ...దానితో దురహంకారం పెరిగి స్వర్గం,భూమిపైన దాడిచేయడం,దేవుళ్ళను పూజించకుండా తననే పూజించాలని ఆజ్ఞాపిస్తడు.అతని స్వంతకుమారుడైన ప్రహ్లోదుడు విష్ణుభగవంతుడను ప్రార్థించేవాడు ..తనకొడుకునే చంపాలని నోట్లో విషంపోస్తే అమృతంకావడం,ఏనుగులతో తొక్కించమని ఆదేశించిన ఎటువంటి హానీజరగకపోవడం, ఆకలితోఉన్నా విషసర్పాలున్నా గదిలో ఉంచిన ఏమీకాకపోవడం జరిగింది.చివరికి ప్రహ్లదుడిని హిరణ్యకశ్యపుడి యొక్క సోదరి అయిన హోలిక ఒడిలో చితిలో కూర్చోవాలని ఆజ్ఞాపిస్తాడు.ఎందుకంటే మంటలనుండి కాపాడి,రక్షించే శాలువాను ఆమే ధరించడంవలన ఆమెకీ ఎలాంటి హానిజరగదు.ప్రహ్లోదుడు వాళ్ళనాన్న మాటలు ఒప్పుకోని,విష్ణువును కాపాడమని వేడుకుంటాడు.మంటలు మొదలై అందరు చూస్తున్నపుడు హోలిక శాలువా ఎగిరిపోయి ప్రహ్లదుడిని కప్పుతుంది.హోళికా దాహనమై ఇతడు బ్రతుకుతాడు.అందుకే ప్రజలు తరువాత రోజున హోళీ జరుపుకుంటారు.

మరొకటిచూస్తే ...ప్రేమదేవుడైన కామదేవుడు,పార్వతి శివుణ్ణి పెళ్లి చేసుకోవడానికి సహాయంగా శివుని తపస్సును బంగపరచాడనికి పూనుకుంటే అతనిపై శివుడు బాణంవదిలి కామదేవుడి శరీరాన్ని నాశనంచేస్తాడు.ఆతర్వాత తన త్రినేత్రాన్ని తెరిచి కామదేవుడిని బూడిదచేసాడు.అయన భార్య రతి కోరికమేరకు శివుడు కామదేవుడిని మరలా బ్రతికిస్తడు కానీ భౌతికకామం కంటే నిజమైన ఉద్రేకపూరిత ప్రేమ ఆధ్యాత్మికతను తెలియజేసి మానసిక ప్రతిరూపంగానే బ్రతికిస్తడు.ఈ సంఘటన వలన హోళీరోజున భోగిమంటలు వేసి ఘనంగా జరుపుకుంటారు ...ఇంకొకకథ చూస్తే ....వసంతకాలంలో వాతావరణంలో మార్పులు జరగటం వల్ల వైరల్ జ్వరం,జలుబు వస్తాయని ప్రజలు నమ్ముతారు.అందుకని సహజమైనరంగు పొడులను చల్లుకోవడంవలన ఔషదంగా పనిచేస్తుందని అర్థం.నిమ్మ,కుంకుమ,పసుపు బిల్వాలనుపయోగించి ఆయుర్వేద ఔషధవనమూలికలను తయారుచేస్తారు.

తడిరంగుల కొరకు మోదుగ పుష్పములు రాత్రంతా మరిగించి అవి పసుపురంగులకు మారేంతవరకు ఉంచుతారు.దానిని చల్లుకోవడం వలన ఔషధగుణాలుండటంచేత మానవశరీరాలను కాపాడేది.దురదృష్టవశత్తూ అది వ్యాపారుల చేతిలోకివెళ్ళి శరీరానికి భంగంకలిగిస్తూ, హానికరంగా తయారైంది.కాలక్రమేణ సమాజ పరిణామక్రమములో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులవల్ల వసంతకాలంలో రంగులనిచ్చే చెట్లు కనుమరుగవ్వడంతో దేశంలోని పట్టణాలలో రసాయానిలతో రంగులను తయారుచేసే ఫ్యాక్టరీలువెలిసి మానవజీవితాలతో వ్యాపారం చేస్తున్నాయి. ప్రస్తుతం మనం జరుపుకునే హోళీ పండుగను పరిశీలిస్తే మనం సమాజంలో ఎటువైపు వెళ్ళుతున్నామో ...రాబోయే తరాలకు ఎలాంటి మార్గనిర్దేశకాలనిస్తున్నామో ..ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.ప్రత్యేకంగా ఇప్పుడు జరుపుకునే హోళీ పండుగను తీసుకుంటే ...దేశ వ్యాప్తంగానే గాకుండా మన పొరుగు దేశాలైన నేపాల్,బంగ్లాదేశ్ లో సైతం జరుపుకుంటున్నారు.కానీ జరుపుకునే విధానం రోజురోజుకు మితిమీరిపోయేవిదంగా నెలకొంటుందనడంలో ఎలాంటి అనుమానం అక్కరలేదు.ఈ పండుగ వచ్చిందంటే చాలు,చిన్నపిల్లల నుండి పండు ముదుసలి వరకు ఎలా ప్రవర్తిస్తున్నారో ఒకసారీ చూస్తే ....నేడు చిన్నచిన్న గ్రామాలలో సైతం కులాలకు మతాలకు అతీతంగా ఆనందభరితంగా జరుపుకుంటూ,భిన్నత్వంలో ఏకత్వాన్నీ సూచించే విదంగా ఉన్నా ! జరుపుకుంటున్న విధానాలెలా ఉన్నాయో ఒక్కసారీ మనల్నీ మనమే ప్రశ్నించుకోవాల్సిన అవసరం ఆసన్నమైంది.ముందుగా పిల్లల నుండి యువకులవరకు,వివిధ రసాయనాలతోకూడిన రంగులను వాడటం,ఇంకొన్నిచోట్ల టమాటలతో కొట్టుకోవడం,మరీదరిద్రంగా కోడిగుడ్లతో తలపైకాకుండా ఎక్కడెక్కడో పూసుకోవడం, పారుతున్న మురికికాలువలో ముంచడం లేదా అందులోని బురదను ఒళ్ళంత పూయడమే గాకుండా ఇంకా యంత్రాలలో వాడిన ఇంజన్ ఆయిల్ తో మొహానికి పూసుకోవడం ...ఇదిగాక ఇరుగుపొరుగు వారిని,తెలిసినవారిని,తెలియనివారి దగ్గర బలవంతంగా డబ్బులు వసూలుచేసి,తాగి తందనాలు ఆడటం లాంటివి దేనికి నిదర్శనమో ఒక్కసారీ సగటువ్యక్తి ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.తాగినమైకంలో హోళీఆడుతూ అవతలివారి మనోభావాలను అర్థంచేసుకోకుండా ఇబ్బందిపెట్టడం లాంటి విషయాలను చూస్తుంటే మనము సమాజంలో ఎక్కడికి వెళ్లుతున్నామో అర్థంగానీ పరిస్థితి.చేసేపని ఆడేఆట ఎవ్వరిని ఇబ్బంది పెట్టకుండా మధురజ్ఞాపకంగా మారేవిదంగా ఉండాలని ఆశిద్దాం.

డా.పోలం సైదులు,తిరుమలగిరి,
వంగూర్ మండలం.
9441930361.



# అంగరంగ వైభవంగా కొనసాగుతున్న కల్కిదోన వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు

- ముఖ్య అతిథిగా సేవకులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రామకృష్ణ





**తలకొండపల్లి, మార్చి 2(నీలగిరి ఎక్స్ ప్రెస్):** తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో వెలిసినటువంటి పురాతన స్వయంభు శ్రీ వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యఅతిథిగా ప్రముఖ సంఘ సేవకులు 5వ వార్డు కౌన్సిలర్ పాపిశెట్టి రాము పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని చక్రతీర్థం, స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి దివ్యమంగళ రూపాన్ని దర్శించుకోవడం జరిగింది. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా పచ్చటి తోరణాలతో, రకరకాల పూలమాలలతో ముస్తాబు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం గుడి ప్రాంగణం లో ఏర్పాటుచేసిన ఎడ్ల బండ్ల బండలాగుడు పోటీ కార్యక్రమాలను పాపిశెట్టి రాము ప్రారంభించారు. ఈ బ్రహ్మోత్సవాలను కనులారా వీక్షించడానికి వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీ పట్టాభిరామ శర్మ, కృష్ణమూర్తి అయ్యగారు, ప్రవీణ్ కుమార్, చుక్కాపూర్ గ్రామ సర్పంచ్ మాకం వీరేష్, ముఖ్య నాయకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులను అవమానించిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు వెంటనే క్షమాపణ చెప్పాలి : కాళ్ల జంగయ్య



**యాచారం, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హైదరాబాద్‌లో శనివారం జరిగిన టీఎన్జీవో సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ వికలాంగులను అవమానించేలా వ్యాఖ్యలు చేయడం తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. "వైకల్యం ఎత్తిచూపుతూ 'తోంటోడు' అని మాట్లాడడం వికలాంగుల సమాజాన్ని అవమానించింది" అని వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్పిఎస్) రాష్ట్ర కమిటీ ఖండించింది.రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య మాట్లాడుతూ, "వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు తీసుకొచ్చినా, ఇలాంటి అవమానాలు ఆగడం లేదు. బాధ్యత గల పదవిలో ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం దివ్యాంగులపై చులకన భావాన్ని ప్రతిబింబిస్తుంది. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు.అలాగే, "క్షమాపణ చెప్పకపోతే 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం కింద కేసు నమోదు చేయాలని, ఆక్ట్ కమిషన్ సుమోటోగా చర్యలు తీసుకోవాలని" కోరారు. ఇలాంటి వారిని ప్రభుత్వ ఉద్యోగం నుంచి తొలగించాలని కూడా డిమాండ్ చేశారు.జంగయ్య హెచ్చరిస్తూ, "24 గంటల్లోపు క్షమాపణ చెప్పకపోతే ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు చేపడతాం. టీఎన్జీవో భవనాన్ని ముట్టడిస్తాం" అని స్పష్టం చేశారు.

## ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతీయొద్దు టీపీయూఎస్



**ఇబ్రహీంపట్నం, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల జీతభత్యాలు, పదోన్నతులపై విద్యా కమిషన్ సమర్పించిన నివేదిక ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర మనోవేదనకు గురి చేసిందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెల్కలపల్లి పెంటయ్య అన్నారు.ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "అరకొర వసతులతో, ప్రైవేట్ పాఠశాలలతో పోటీ పడుతూ పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు విద్య బోధిస్తున్న ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని తగ్గించేలా నివేదిక రూపొందించబడింది" అని విమర్శించారు.నివేదికలో కొత్తగా మండలానికి రెండు పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి, ఉన్న పాఠశాలలను మూసివేయమని సూచించడం వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇప్పటికే పిఆర్సి అమలు కాక, ఐదు డిఏలు పెండింగ్‌లో ఉండగా, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు బకాయిల కోసం ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు."ఉపాధ్యాయుల జీతాలు ఉన్నతంగా ఉంటేనే మేధావులు విద్యారంగంలోకి వస్తారు అని 1964లోనే కొఠారి కమిషన్ పేర్కొంది. కనీస అవగాహన లేకుండా రూపొందించిన ఈ నివేదికను టీపీయూఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది" అని పెంటయ్య స్పష్టం చేశారు.ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, పాఠశాలలను బలోపేతం చేసే విధంగా నివేదికను మార్చాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశిరావు, ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్, రాష్ట్ర మీడియా కో కన్వీనర్ సత్తారి రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు రాజేందర్, జిల్లా బాధ్యులు నరసింహ, కరుణాకర్, జంగయ్య పాల్గొన్నారు.

## డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



**నాగర్‌కర్నూల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కల్వకుర్తి మండల మార్చల గ్రామ సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. డీసీఎం వాహనం అతివేగంగా వచ్చి ఇద్దరిని ఢీకొట్టగా, చాంద్ పాషా (62) మృతి చెందినట్లు గుర్తించారు.ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలి

**- శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం.**
**-ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి తీదేడు గ్రామ సర్పంచ్ .**



**దేవరకొండ మార్చి 02. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
ప్రతి ఒక్కరు శ్రీ శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.శ్రీ శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు అంగరంగ వైభవంగా జరుగుతుయన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ఆధ్యాత్మిక చరిత్రకు ప్రతీకగా నిలిచిన శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి దేవస్థానం ఈ సంవత్సరం కూడా వైభవంగా బ్రహ్మోత్సవాలకు ముస్తాబయిందన్నారు.దేవస్థానం పరిసరాలు విద్యుత్ దీపాలతో, పుష్పాలతో అలంకరించబడగా,గ్రామమంతా పండుగ వాతావరణం నెలకొన్నదన్నారు.శ్రీ రామలింగేశ్వర స్వామి వారిని విశ్వకర్మ భజన బృందం,డప్పు చప్పులతో ఊరేగింపుగా గుట్ట ఎక్కుటతో పాటు కామదహనం జరిగిందన్నారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు,నిత్య అన్నదానం,రథోత్సవం మహోత్సవం జరుగునన్నారు.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సదుపాయం,ఉచిత అన్న ప్రసాదం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,ఆలయ అర్చకులు సురభి సత్యనారాయణ శర్మ సోదరులు,సురభి ప్రభాకర్ శర్మ,మాజీ ఉప సర్పంచ్లు ధరణిపతి రమణారావు, ఉలుపాల శేఖర్ రెడ్డి,సోనగంటి గోవర్ధనాచారి, మాజీ పి.ఏ.సి.యస్ డైరెక్టర్ తిరుమణి పాపయ్య,గ్రామ పాలక వర్గం వార్డు సభ్యులు బొడ్డు పార్వతమ్మ యాదగిరి,మాదగోని కృష్ణ గౌడ్, గంటెల అలివేలు సోమయ్య,దాసరి కళమ్మ ముత్తయ్య,రెడ్డి పద్మ పరమేష్,సందె లక్ష్మయ్య,మర్ల యాదగిరి,శివర్ల పర్వతాలు,గ్రామ పెద్దలు మద్రు రామారావు, మోర కిరణ్,జూలూరి శ్రీధర్,గ్రామ ప్రజలు , గ్రామ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంతో తెలంగాణ యాత్ర

### "రైజింగ్2047" దిశగా దృఢ సంకల్పం




వికసిత్ భారత్2047 లక్ష్యంగా దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలన్న దృక్పథానికి అనుసంధానంగా తెలంగాణ రాష్ట్రం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న మహత్తర సంకల్పంతో "తెలంగాణ రైజింగ్2047" విజన్‌ను ప్రకటించింది. ఇది కేవలం నినాదం కాదు; భవిష్యత్ తరాలకు సుస్థిర అభివృద్ధి, సమగ్ర వృద్ధి, సమాన అవకాశాల పథం వేయాలన్న దీర్ఘకాలిక ప్రణాళిక. రాష్ట్ర అభివృద్ధిని ప్రాంతాల వారీగా సమతుల్యంగా మలచేందుకు మూడు ఆర్థిక మండళ్లుగా విభజించడం ఈ విజన్‌కు ప్రత్యేకత. CURE, PURE, RARE అనే మూడు రూపకల్పనలతో తెలంగాణను భిన్న రంగాల అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది CURE పరిధిలో పట్టణ రద్దీ తగ్గింపు, కాలుష్య నియంత్రణ, ఆధునిక మౌలిక వసతుల విస్తరణ ద్వారా హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ స్థాయి మెట్రోగా అభివృద్ధి చేయడమే ప్రధాన లక్ష్యం. మెట్రో విస్తరణ, స్మార్ట్ రవాణా, శుద్ధ వాతావరణంఇవి నగర జీవన ప్రమాణాలను పెంచే దిశగా అడుగులు. PURE మండలం ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్ మధ్య ప్రాంతాలను తయారీ కేంద్రాలుగా మార్చేందుకు రూపుదిద్దుకుంది. పరిశ్రమలు, లాజిస్టిక్స్ హబ్‌లు, నూతన పారిశ్రామిక పట్టణాల ఏర్పాటు ద్వారా పెట్టుబడులను ఆకర్షించి ఉపాధి అవకాశాలను విస్తరించాలన్న సంకల్పం ఇందులో ప్రతిఫలిస్తుంది. RARE మండలం వ్యవసాయం, గ్రీన్ ఎకానమీ, అగ్రో ప్రాసెసింగ్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తుంది. రీజినల్ రింగ్ రోడ్‌కు వెలుపల ఉన్న ప్రాంతాల్లో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం. పర్యావరణఅభివృద్ధి సమన్వయానికి ఉదాహరణగా బాపు ఘాట్ వద్ద గాంధీ సరోవర్ నిర్మాణం, గ్రీన్ ఫీల్డ్ హైవేల విస్తరణ, డ్రై పోర్టుల అభివృద్ధి చేపడుతున్నారు. మెట్రో రైలు రెండో దశ విస్తరణతో పాటు వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో విమానాశ్రయాల ఏర్పాటుతో ప్రాంతీయ సమతుల అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.రాష్ట్రాన్ని జాతీయ ఆర్థిక ధ్రువంగా నిలపాలన్న లక్ష్యంతో నాగపూర్, బెంగళూరు, విజయవాడ నగరాలతో ఇండస్ట్రియల్ కారిడార్ల నిర్మాణం ప్రణాళికలో భాగమైంది. ఈ అనుసంధానం తెలంగాణను దేశ పారిశ్రామిక పటంలో కీలక స్థానానికి తీసుకెళ్లగలదు. ఇటీవల నిర్వహించిన గ్లోబల్ AI సమ్మిట్ ద్వారా రాష్ట్రాన్ని కృత్రిమ మేధస్సు కేంద్రంగా మలచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకోవడం మరో ముందడుగు. ప్రపంచ స్థాయి టెక్నాలజీ సంస్థలతో భాగస్వామ్యాలు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం, నైపుణ్యాభివృద్ధిఇవి భవిష్యత్ ఉపాధికి మార్గదర్శకాలు. ప్రపంచ నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణ, భద్రతా పరంగా కొత్త పోలీస్ కమిషనరేట్‌ల ఏర్పాటు, ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపులు వంటి చర్యలు చేపట్టడం గమనార్హం. మూసి నది రివర్ ఫ్రంట్ అభివృద్ధి, చెరువుల పరిరక్షణ ద్వారా నగర సౌందర్యాన్ని పెంపొందించే ప్రయత్నం కొనసాగుతోంది. లైఫ్ సైన్సెస్, క్లీన్ ఎనర్జీ, డిజిటల్ ఇన్నోవేషన్ రంగాల్లో తెలంగాణను ముందంజలో నిలబెట్టాలన్న సంకల్పం "రైజింగ్" నినాదంలో ప్రతిఫలిస్తోంది. అయితే ఈ మహత్తర లక్ష్యాలు సాధ్యమవ్వాలంటే రాజకీయాలకు అతీతంగా సమగ్ర కార్యాచరణ, పారదర్శక అమలు, ప్రజల భాగస్వామ్యం అవసరం. ట్రిలియన్ లక్ష్యం దూరమైన కల కాదుదృఢ సంకల్పం, సమర్థ పాలన, సమిష్టి కృషి ఉంటే తెలంగాణ నిజంగా "రైజింగ్ స్టేట్"గా దేశ వృద్ధిలో దిశానిర్దేశం చేసే శక్తిగా అవతరిస్తుంది.

**వ్యాసకర్త**

గోరుపాటి శంకర్ ఎంఎ (తెలుగు) ఉస్మానియా యూనివర్సిటీ & ఎంసీజే
(రచయిత , జర్నలిస్టు)
చరవాణి 8179885282



## ప్రజావాణికి భారీగా ఫిర్యాదులు



**నల్లగొండ మార్చి 2( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
నల్గొండ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 123 ఫిర్యాదులు అందాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ శాఖకు 59 ఫిర్యాదులు రాగా, ఇతర శాఖలకు సంబంధించి 64 అర్జీలు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్, అశోక్ రెడ్డితో పాటు ఆర్డీవోలు రమణారెడ్డి, శ్రీదేవి తదితరులు పాల్గొని ప్రజల సమస్యలను స్వీకరించారు

## మెట్టుపల్లి మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన లింబాద్రిని సన్మానించిన ఆర్యవైశ్య మహాసభ




**జగిత్యాల, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మెట్టుపల్లి నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రిని కరీంనగర్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కన్న కృష్ణ, వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం చైర్మన్ చిట్టుమల్ల శ్రీనివాసు, మహాసభ ప్రధాన కార్యదర్శి కొమరవెల్లి వెంకటేశం, కోశాధికారి పడకంటి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## అనాధలకు పేదలకు
# సేవ చేయడమే లైవ్
- డాక్టర్ ఝాన్సీరాణి



**నల్లగొండ , మార్చి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
అనాధలకు, పేదలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ శక్తి న్యూ వాయిస్ ముందంజలో ఉంటుందని క్లబ్ జోన్ చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ రాణి పసలపూడి అన్నారు. సోమవారం స్థానిక మదర్ తెరిసా హోమ్ లో గతంలోసెంట్రల్ సోషల్ వెల్ఫేర్ అడ్వైజరీ బోర్డు మెంబర్ గా పనిచేసిన స్వర్గీయ కరుణారెడ్డి 87వ జయంతి సందర్భంగా వృద్ధులకు పండ్లు, అన్నదానం నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ శక్తి న్యూవాయిస్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, కరుణ రెడ్డి జయంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు రజిత రెడ్డి, అజితా రెడ్డి, పూర్ణిమా రెడ్డి లు ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మా క్రాంతి, స్వాతి రాంబాబు, మదర్ తెరిసా హోమ్ సిస్టర్స్ తదితరులు పాల్గొన్నారు

## రాష్ట్ర ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
-రంగుల పండుగ హోళీ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని కాంక్షించిన మంత్రి



**నల్లగొండ, మార్చి 2 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తెలంగాణ రాష్ట్ర,రోడ్లు భవనాలు సినీమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు రాష్ట్ర ప్రజలకు హోళీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు రంగుల పండుగ హోళీ ప్రజలందరి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు ఈ పండుగ మన సమాజంలో సోదరభావాన్ని,ప్రేమాభిమానాలను పెంపొందించాలని ఆయన కోరారు అందరూ కలిసి జరుపుకునే ఈ రంగుల పండుగ మన సంస్కృతికి,ఐక్యతకు నిదర్శనమని,రసాయన రంగులకు దూరంగా ఉండి, ప్రకృతి సిద్ధమైన రంగులతో పర్యావరణానికి హాని కలగకుండా పండుగను జరుపుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే ఈ హోళీ, ప్రతి ఇంటిలో సుఖసంతోషాలను, సిరిసంపదలను నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు రాష్ట్ర ప్రజలందరూ సురక్షితంగా, ఉత్సాహంగా ఈ పండుగను జరుపుకోవాలని కోరారు.

# విద్యార్థుల్లో వ్యవస్థాపక దృక్పథంపై అవగాహన
--ఈడిఎస్ & టిస్ కేసి ఆధ్వర్యంలో కార్యక్రమం.
--ప్రిన్సిపాల్ డాక్టర్ రామావత్ రవి.




**దేవరకొండ మార్చి 02. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
వ్యవస్థాపక అభివృద్ధి సెల్ తెలంగాణ నైపుణ్య మరియు జ్ఞాన కేంద్రం సహకారంతో మునగాల కొండల్ రావుకళాశాల విద్యార్థులలో వ్యవస్థాపక దృక్పథంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కళాశాల ప్రాజెక్ట్ పనిలో భాగంగా కళాశాల విచ్చేసిన టి టి డబ్ల్యూ ఆర్ డిగ్రీ ఉమెన్స్ లెక్చరర్, దివ్య మరియు విద్యార్థినులకు సహకరిస్తూ విద్యార్థులు చదువు పూర్తయ్యాక ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలకే పరిమితం కాకుండా వేరే వాటిపై ఆధారపడకుండా వినూత్నమైన ఆలోచనలతో వ్యవస్థాపక దృక్పథం కలిగి, అనిల్ అంబానీ ముఖేష్ అంబానీ లాంటి గొప్ప స్థాయికి విద్యార్థులు చేరుకోవాలని , విద్యార్థులకు ప్రిన్సిపల్ డాక్టర్. రామావత్ రవి తెలియ పరచారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీ జి కోటయ్య ,టి ఎస్ కే సి & ప్లాస్మెమెంట్ కోఆర్డినేటర్ శ్రీ లింగమయ్య మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## షాద్‌నగర్ డిసిపి ఆఫీసును సందర్శించిన సిపి సుధీర్ బాబు



**షాద్‌నగర్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఫ్యూచర్ సిటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సుధీర్ బాబు షాద్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన డిసిపి కార్యాలయాన్ని సోమవారం సందర్శించారు. డిసిపి శిరీష ఆయనను స్వాగతించారు.ఈ కార్యక్రమంలో పట్టణ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి పోతుగంటి రాములు



**నాగర్‌కర్నూల్, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
బల్మూరు మండల తుమ్మనిపేట గ్రామంలో జరిగిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి పోతుగంటి రాములు, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్ వధూవరులను ఆశీర్వదించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో నూతన దంపతులకు ప్రేమ, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు.

# మేడిపల్లి లో ఘనంగా కామ దహన వేడుకలు



**ఇబ్రహింపట్నం మార్చి 02 (నీలగిరి ఎక్స్ ప్రెస్ )**
: యాచారం మండలం అంతటా కామదహనం వేడుకలను ఘనంగా మండల ప్రజలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగకు ఒకరోజు ముందు రాత్రి కాముని దహనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. దాంట్లో భాగంగా నక్కర్త మేడిపల్లి గ్రామంలో సర్పంచ్ ముచ్చర్ల సుగుణ సంపత్ ,ఆధ్వర్యంలో పీడుకలతో కట్టెలను పేర్చి కామదహన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద్భంగా సర్పంచ్ సుగుణ సంపత్ మాట్లాడుతూ... గ్రామ ప్రజలకు హోలి పండుగ శుభాగంక్షలు తెలిపారు . కామ దహనం అనేది హోలీ పండుగకు ఒక రోజు ముందు జరిగే ముఖ్యమైన ఆచారం అని, ఇది మనిషిలోని చెడు గుణాలైన కామం, అహంకారం, అసూయ. క్రోధాన్ని దహించివేసి మనస్సును పవిత్రం చేస్తుందని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఆనందంగా ఉందని అన్నారు.హోలి పండుగ సంప్రదాయం మైన రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేంది మధుకర్ రెడ్డి వార్డు సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ ఎరుకల బాలరాజు గౌడ్, మాజీ ఎంపీటీసీ మోటే శ్రీశైలం, గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఓదెల మల్లన్న ఆశీస్సులతో పెద్దపల్లి ప్రజలు సుభిక్షంగా ఉండాలి
-ఎమ్మెల్యే విజయరమణారావు





**పెద్దపల్లి, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదివారం కుటుంబ సమేతంగా ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.బోనాలు సమర్పించి, పట్నాలు వేసి స్వామివారిని కొలిచిన అనంతరం ఆలయ కమిటీ తరఫున మెమెంటోలు, కండువాలతో ఘన సత్కారం చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకట్ల మొండయ్య, ఈవో సదయ్య, డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి





**ఎలిగేడు, మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ధూళికట్ట గ్రామంలోని అంగన్వాడీ2లో సోమవారం విలేజ్ హెల్త్ న్యూట్రిషన్ డే నిర్వహించారు. చిన్నపిల్లల బరువులు తూచి, గర్భిణీలకు కోడిగుడ్లు, పౌష్టికాహారం అందజేశారు."గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం కోసం అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి" అని టీచర్లు సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ప్రభావతి, భారతి, వెంకటమ్మ, రజితతో పాటు గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

# మార్చి 5న చలో విజయవాడ

**ఎస్.ఏ.చిన్న రహిమాన్**



**ప్యాపిలి మార్చి 2 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శిక్షణ పొందిన ఏఎన్ఎం, జిఎన్ఎమ్ లకు పర్మినెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశాల సంఖ్య పెంచాలని కోరుతూ జలదుర్గం పిహెచ్సి సెంటర్ మెడికల్ ఆఫీసర్ హరితకు సోమవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి ఎస్ఏ . చిన్న రహిమాన్ మాట్లాడుతూ వేతనాలు పెంచి ఏడు సంవత్సరాలు అవుతుందని ధరలకు అనుగుణంగా ఆశా వర్కర్స్ కు వేతనాలు పెంచాలని ఇరవై సంవత్సరాలుగా ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు సెలవులు లేకపోవడంతో అనారోగ్యాల పాలవుతున్నారని కావున అంగన్వాడీలకు అమలవుతున్న అన్ని రకాల సెలవులు (వేసవి సెలవులు) ఆశ వర్కర్లకు అమలు చేయాలని,ప్రభుత్వం చెల్లించే పదివేలల్లో నెలలో పిహెచ్సి లకు, ఆసుపత్రులకు వెళ్లడానికి మూడు నుండి నాలుగు వేలు ఖర్చవుతున్నాయని అన్నారు. సంబంధం లేని పనులు చేయించడం అధిక జనాభాలో పనిచేయడం వలన ఆశా వర్కర్ను తీవ్ర పని ఒత్తిడికి గురై అనారోగ్యల పాలవుతున్నారు అన్నారు. సమస్యల పరిష్కారానికై మార్చి 5వ తేదీన విజయవాడలో రాష్ట్ర ధర్నా నిర్వహించాలని యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని అన్నారు. కనీస వేతనాలు చెల్లించాలని కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ని ఆశలుగా మార్చాలి, సమాన వేతనం ఇతర సౌకర్యాలు కల్పించాలని, అన్ని రకాల సెలవులు ఇవ్వాలని, దహన సంస్కారాలు ఖర్చులు ఇవ్వాలని, నియమాకాలు ప్రభుత్వమే చేపట్టాలని, పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఆశ వర్కర్ సంఖ్యను పెంచాలి. పీహెచ్సీ కి వెళ్లిన ప్రతి సందర్భంలో టీఏ డీఏలు ఇవ్వాలని, ఏఎన్ఎం జిఎన్ఎమ్ శిక్షణ పొందిన ఆశాలకు పెర్మనెంట్ పోస్టుల భర్తీ సందర్భంగా ప్రాధాన్యత కల్పించాలని, 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని నాణ్యమైన మొబైల్స్ యూనిఫామ్ ఇవ్వాలని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. పై సమస్యలపై మార్చి 5వ తేదీన చలో విజయవాడ జయప్రదం చేయాలని ఆశా లకు కోరారు.ఈ కార్యక్రమం లో సిఐటియు నాయకులు సి. మధు, రాసి పోగుల శివ ప్రతాప్, ఆశా వర్కర్లు లక్ష్మీదేవి, పీ.కృష్ణవేణి, సునీత, రేణుక తదితరులు పాల్గొన్నారు.